# లాభాల్లో భారత స్టాక్ మార్కెట్లు.. 326 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలబాట పట్టాయి. గురువారం భారీ నష్టాలతో ముగిసిన మార్కెట్, శుక్రవారం మాత్రం లాభాలతో ముగిసింది. మధ్యాహ్నం 3.30 గంటలకు ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 325.72 పాయింట్ల లాభంతో 74,532.96 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 112.35 పాయింట్లు పెరిగి, 23,114.50 వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ 74,800 పాయింట్ల వద్ద సానుకూలంగానే ప్రారంభమైంది. ఒక దశలో 600 పాయింట్ల లాభాలు పొందింది. నిఫ్టీ కూడా 23,200 పాయింట్ల వద్ద ప్రారంభమై ఒక దశలో 200 పాయింట్లు పెరిగింది. ముందుగా మంచి లాభాలతో ట్రేడింగ్ మొదలైనప్పటికీ, చివర్లో అమ్మకాల ఒత్తిడి మూలంగా స్వల్ప లాభాలకే పరిమితమవ్వాల్సి వచ్చింది. శుక్రవారం జరిగిన ట్రేడింగ్‌లో అనేక సంస్థలు లాభాలబాట పట్టగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మాత్రం భారీగా నష్టపోయింది. 2.29 శాతం నష్టాలు చవిచూసింది. అలాగే భారత్ ఎలక్ట్రానిక్స్ 1 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ 0.57 శాతం, ఇండిగో లిమిటెడ్ 0.25 శాతం, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ 0.16 శాతం నష్టపోయాయి. టెక్ మహీంద్రా లిమిటెడ్ 3.01 శాతం, ఇన్ఫోసిస్ 2.90 శాతం, టాటా స్టీల్ లిమిటెడ్ 2.81 శాతం, ట్రెంట్ 2.60 శాతం, టైటాన్ కంపెనీ 1.93 శాతం లాభాలు పొందాయి. అంతర్జాతీయంగా మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 110 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4665 డాలర్లకు చేరింది. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ మరింత క్షీణించింది. 86 పైసలు తగ్గి 93.75 వద్ద కొనసాగుతోంది.

# ఇరాన్ వార్ ఎఫెక్ట్.. ప్రీమియం పెట్రోల్ ధర పెంపు.. లీటర్‌కు రూ.2.35 పెరుగుదల



ఇరాన్ వార్ ప్రభావం ఇప్పుడు మెల్లిగా ఇండియాలో పెట్రోల్, డీజిల్‌పై కూడా పడబోతుంది. ఇప్పటికే ఎల్పీజీ కొరత, ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలపై ఇప్పుడు పెట్రో భారం మొదలైంది. ప్రీమియం పెట్రోల్ (పవర్ పెట్రోల్) ధరల్ని పెంచుతూ హెచ్‌పీసీఎల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. లీటర్‌కు రూ.2 నుంచి రూ.2.35 వరకు ఈ పెంపు ఉండనుంది. శుక్రవారం నుంచే ఈ నిర్ణయం అమలులోకి రానుంది. అయితే, ధరల పెంపునకు గల కారణాల్ని మాత్రం కంపెనీ అధికారికంగా వెల్లడించలేదు. ఇండియన్ ఆయిల్ సంస్థకు చెందిన ఎక్స్‌పీ95 రకం పెట్రోల్, అలాగే హిందుస్తాన్ పెట్రోలియం సంస్థకు చెందిన పవర్ పెట్రోల్ వంటి హై ఆక్టేన్ ఫ్యూయల్స్‌కు ఈ పెంపు వర్తిస్తుంది. ప్రస్తుతం కొన్ని ఎంపిక చేసిన నగరాల్లోనే ఈ ధరల పెంపు ఉండనుంది. ఈ పవర్ పెట్రోల్ సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే మరింత మెరుగ్గా పని చేస్తుంది. వాహనాలకు ఎక్స్‌ట్రా పవర్, పర్ఫామెన్స్ అందిస్తుంది. అయితే, ఈ తరహా పెట్రోల్ వాడే వాహనాలు చాలా తక్కువ. ఇక పవర్ పెట్రోల్ ధరలు పెరిగినప్పటికీ సాధారణ పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పు లేకపోవడం సామాన్యుడికి ఊరట కలిగించే అంశం. ఇటీవలి కాలంలో వీటి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఒకపక్క అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నప్పటికీ, మన మార్కెట్లో చమురు ధరలు మాత్రం పెరగడం లేదు. అయితే, పవర్ పెట్రోల్ ధర పెరగడానికి పశ్చిమాసియా ఉద్రిక్తతలే కారణమని మార్కెట్ నిపుణులు అంటున్నారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

ప్రస్తుతం బ్యారెల్ క్రూడాయిల్ ధర 110 డాలర్ల వరకు ఉంది. భారత కరెన్సీ విలువ తగ్గడం కూడా చమురు దిగుమతులపై ప్రభావం చూపిస్తోంది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు ఇది భారంగా మారింది. ఈ నేపథ్యంలో అన్ని రకాల పెట్రోల్ ధరలు పెంచకుండా ప్రీమియం లేదా పవర్ పెట్రోల్ ధరల్ని మాత్రమే పెంచుతున్నాయి.

# కస్టమర్లకు షాక్.. ప్లాట్‌ఫామ్ ఫీజు భారీగా పెంచేసిన జొమాటో




ప్రముఖ ఫుడ్ డెలివరీ కంపెనీ జొమాటో కస్టమర్లకు షాక్ ఇచ్చింది. ప్లాట్‌ఫామ్ ఫీజును భారీగా పెంచేసింది. ప్రతీ ఆర్డర్‌పై రూ.2.40 పెంచింది. 12.50 రూపాయలు ఉన్న ప్లాట్‌ఫామ్ ఫీజును 14.90 రూపాయలు చేసింది. ఈ పెంపు నిర్ణయం ఈ రోజు (శుక్రవారం) నుంచే అమల్లోకి వచ్చింది. జొమాటో ఏటా ప్లాట్ ఫామ్ ఫీజును పెంచుతూ వెళుతోంది. గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో కూడా జొమాటో ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచింది. 10 రూపాయలు ఉన్న ప్లాట్‌ఫామ్ ఫీజును 12.50 రూపాయలు చేసింది. ఫుడ్ కాస్ట్ పెరిగిన ఈ సమయంలో కస్టమర్లకు జొమాటో నిర్ణయం పెను భారంగా మారనుంది. జొమాటో గోల్డ్ సభ్యులకు డెలివరీ ఛార్జీలు ఉచితం అయినప్పటికీ, వారు కూడా ఈ ప్లాట్‌ఫామ్ ఫీజును తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. పశ్చిమాసియా దేశాల్లో యుద్ధం కారణంగా దేశంలో గ్యాస్ కొరత ఏర్పడింది. మరీ ముఖ్యంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. దీంతో పలు హోటళ్లు మూతపడ్డాయి. కొన్ని హోటళ్లు ధరలను పెంచేశాయి. పెరిగిన ధరలతో ఫుడ్ కాస్ట్ 100 రూపాయలు ఉంటే.. డెలివరీ ఫీజు, ప్లాట్‌ఫామ్ ఫీజు, జీఎస్టీతో కలిపి బిల్లు 150 రూపాయల నుంచి 170 రూపాయలు కానుంది.

### ఫుడ్ డెలివరీ రంగంలోకి ర్యాపిడో..

జొమాటో, స్విగ్గీలకు పోటీగా ర్యాపిడో ఫుడ్ డెలివరీ రంగంలోకి ప్రవేశించింది. 'ఓన్లీ' పేరిట ఓ కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. కొద్దిరోజుల క్రితం బెంగళూరులో ప్రయోగాత్మకంగా ఓన్లీ సేవలు ప్రారంభం అయ్యాయి. ఓన్లీ యాప్‌లో ఎలాంటి కమీషన్స్ ఉండవని కంపెనీ తెలిపింది. కస్టమర్ కేవలం ఫుడ్ కోసం మాత్రమే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని, అదనంగా ప్లాట్‌ఫామ్ ఫీ.. ఇతర ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదని వెల్లడించింది.

# రాష్ట్ర మొత్తం బడ్జెట్ 3,24,234 కోట్లు.. ఏ శాఖకు ఎన్ని కోట్లు అంటే..!

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం విలువ రూ.3,24,234 కోట్లుగా ఆయన వెల్లడించారు. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లు, తలసరి ఆదాయం రూ.4,18,931 కోట్లుగా పేర్కొన్నారు. రాష్ట్ర వృద్ధి రేటు 10.2 శాతమని ప్రకటించారు. ఈ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు 26,674 కోట్లు, వ్యవసాయ శాఖకు 23,179 కోట్లు, విద్యుత్ శాఖకు 21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు 7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు 1,529 కోట్లు, వైద్య శాఖకు 13,679 కోట్లు, కార్మిక శాఖకు 998 కోట్లు, పర్యాటక రంగానికి 1,224 కోట్లు, మహిళా శిశు సంక్షేమ శాఖకు 3,143 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7,937 కోట్లు, బీసీ సంక్షేమానికి 12,511 కోట్లు, మైనారిటీ సంక్షేమానికి రూ.3,769 కోట్ల చొప్పున కేటాయించారు. అదేవిధంగా పట్టణాభివృద్ధి, పురపాలక శాఖకు



రూ.17,907 కోట్లు, న్యాయశాఖకు రూ.2,367 కోట్లు, రవాణా శాఖకు రూ.12,759 కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు రూ.33,688 కోట్లు, ఐటీ శాఖకు రూ.875 కోట్లు, పరిశ్రమల శాఖకు రూ.3,490 కోట్లు, చేనేతకు రూ.258 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.7,430 కోట్లు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,615 కోట్లు, రాజీవ్ యువ వికాసానికి రూ.6 వేల కోట్లు, శాంతిభద్రతలకు రూ.11,907 కోట్లు, గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్ల చొప్పున కేటాయించినట్లు భట్టి తెలిపారు.

# ఏప్రిల్ నెలాఖరుకల్లా 180 డాలర్లకు ముడి చమురు.. సౌదీ అధికారుల అంచనా




మార్చి 20 ముడి చమురు సరఫరాలో అంతరాయాలు దీర్ఘకాలికమన్న భయాలు పెరుగుతున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో ఇంధన ఉత్పత్తి కేంద్రాలపై దాడులు పెరగడంతో ఈ ఆందోళన అధికమవుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే బ్యారెల్ ముడి చమురు ధర 180 డాలర్లకు చేరుకోవచ్చని సౌదీ అరేబియా అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు అక్కడి అధికారులు ధరల పెరుగుదలపై అంచనాలను రూపొందించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు ముదిరితే 180 డాలర్లకు మించి ధరల పెరుగుదల ఉండవచ్చని సౌదీ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లలో ప్రామాణిక బ్రెంట్ క్రూడ్ ధర 110–120 డాలర్ల మధ్య తచ్చాడుతోంది. ప్రస్తుతం ముడిచమురు సరఫరాలో అవాంతరాలు దీర్ఘకాలికమనే అంచనాకు సౌదీ అధికారులు వచ్చారు. ఈ అంచనాల ప్రకారం, సమీప భవిష్యత్తులో బ్రెంట్ క్రూడ్ ధర 140 డాలర్ల వరకూ ఎగబాకే అవకాశం ఉంది. ఏప్రిల్ ప్రారంభం నాటికి 150 డాలర్లకు బ్యారెల్ ధర చేరుకుంటుంది. ఆ తరువాత కూడా ఉద్రిక్తతలు కొనసాగితే ఏప్రిల్ చివరి నాటికి ధర 180 డాలర్లు దాటిపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో సరఫరాకు తలెత్తే అడ్డంకులు, మార్కెట్ ప్రతిస్పందనలు వంటి వాటి ఆధారంగా సౌదీ అధికారులు ఈ అంచనాకు వచ్చారు. సౌదీ ప్రభుత్వ రంగ సంస్థ అరామ్కో ఏప్రిల్ 2న ముడి చమురు ధరలను సవరించనుందని సమాచారం. ఈ నేపథ్యంలో అరామ్‌కో చర్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# స్టాక్ మార్కెట్‌లో నిన్నటి నష్టాలకు బ్రేక్.. నేడు లాభాల్లో దూసుకెళ్తున్న సూచీలు



మార్చి 20 దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నాటి నష్టాల నుంచి తేరుకున్నాయి. శుక్రవారం భారీ లాభాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. దేశీయ మార్కెట్‌లో సూచీలు రాణిస్తున్నాయి. గత సెషన్‌లో భారీ నష్టాలను చవిచూసిన ట్రేడర్లు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు చేపట్టడం కలిసిసొచ్చింది. ఫలితంగా సెన్సెక్స్ ఒక దశలో 900 పాయింట్లకు పైగా లాభాల్లోకి దూసుకెళ్లింది. కానీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో సెన్సెక్స్ 785 పాయింట్ల లాభంతో 74,992 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 280 పాయింట్లు పుంజుకొని, 23,282 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో టాటా స్టీల్, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ, కోల్ ఇండియా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి. కాగా గురువారం అమెరికా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు అదేబాటులో ఉన్నాయి. నేషనల్ స్టాక్‌ఎక్స్ఛేంజ్, షాంఘై స్టాక్ ఎక్స్ఛేంజ్ మాత్రం లాభాల్లో సాగుతున్నాయి.

# గల్ఫ్ కార్మికులను మరోసారి కాంగ్రెస్ మోసం : బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ అధ్యక్షులు



హైదరాబాద్ : మార్చి 20 తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికులకు మొండి చేయి చూపించి మోసం చేసిందని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖ అధ్యక్షులు రాధారపు సతీష్ కుమార్ ఆరోపించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటామని , ప్రత్యేక ప్యాకేజీని కేటాయిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిందని అన్నారు. గల్ఫ్ పాలసీని తీసుకువస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఇప్పటికి రూపాయి కూడా కేటాయించలేదు. ఉపాధి కోసం తెలంగాణ వాసులు 15 లక్షల మందికి పైగా గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. వారికి నేడు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గల్ఫ్ లో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్‌లో ఉంటున్న కార్మికులకు అండగా ఉండాల్సిన సమయంలో కనీసం గల్ఫ్ కార్మికులకు ఒక్క పైసా కేటాయించక పోవడం బాధాకరమని అన్నారు. గల్ఫ్ కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకునేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడక ముందు సరైనా ఉపాధి గల్ఫ్ దేశాలకు వలసలు పోవడానికి ప్రధాన కారణం కాంగ్రెస్, బీజేపీ పార్టీలేనని విమర్శించారు. రానున్న రోజుల్లో ఆ రెండు పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

